## దేవుడు మన కొరకు చేసిన గొప్ప కార్యములను బట్టి, ఆయనకు (ప్రభువుకు) వందనములు చెల్లిస్తూ, ఆయనను స్తుతించెదము, ఆమేన్ !

1. సృష్టి ఆరంభము నుండి పరలోక దేవుడు సమయమును తరలిస్తూ మనమీద ఆయన కనుదృష్టి నుంచి, మనలను ఎన్నుకొనెను. అటు తరువాత ఈ అంతిమ దినములలో ఆయన మనలను పిలిచి, మనకు రక్షణ భాగ్యమునిచ్చి, మనలను విమోచించెను. అందుచేత మనయొక్క సంపూర్ణ హృదయముతో ప్రభువును స్తుతించెదము. –ఆమేన్ !

(స్తోత్రం ..... స్తోత్రం ...... స్తోత్రం ..... సోత్రం)

2. మనకు రక్షణ భాగ్యమును అనుగ్రహించుటకు దేవుడు రెండు వేల సంవత్సరముల క్రితము ఈ లోకమునకు యేసుక్రీస్తు రూపములో వచ్చి, మనయొక్క అపరాధములన్నియూ ఓపికతో క్షమించి, మనరోగములను, మన పాపములను, ప్రభువు మోసెను. మనకు స్వస్థత కలుగుటకై, ప్రభువు కొరడా దెబ్బలుతిని, అతి భారమైన సిలువను మోసి, సిలువవేయబడెను. ప్రజలచేత నగ్నము చేయబడి, మనకొరకు చనిపోయెను. అందుచేత రండి. ఆయన మనకొరకు చేసిన గొప్పకార్యములను బట్టి, ఆయనకు వందనములు చెల్లిస్తూ ప్రభువును స్తుతించెదము. –ఆమేన్ !

(స్తోత్రం ..... స్తోత్రం ...... స్తోత్రం ..... సోత్రం)

3. మరియు ప్రభువు చనిపోయి, మూడవ దినమునలేచి, జీవింపజేయు ఆత్మగా మారి, పరిశుద్ధాత్మరూపములో సంఘములో ప్రవేశించెను. ప్రభువు ఆత్మ యొక్క ప్రథమ ఫలముగా ఉండి, ప్రభువే మనకు అధికారిగా ఉన్నాడు. మరియు ప్రభువు మనలను ఆయన యొక్క కుమారులుగాను, కుమార్తెలుగాను చేసి ఆయనను తండ్రి అనిపిలుచుటకు, మనకు విశేషమైన అధికారమునను గ్రహించెను. గనుక మనకు విశేషమైన అధికారమును గ్రహించిన, ప్రభువుకు వందనములు చెల్లిస్తూ, ప్రభువును స్తుతించెదము. –ఆమేన్ !

(స్తోత్రం ..... స్తోత్రం ...... స్తోత్రం ..... సోత్రం)

4. ఏ దేవుడైతే తన యొక్క సంఘములో ప్రత్యక్ష పరచుకొనెనో ఆ దేవుడే ఈ కోత కాల సమయములో, కోతకాల ప్రథమఫలమైన క్రీస్తు బ్రెన్‌హాంగా, ఆయన యొక్క సంఘములో బయలు పరచుకొనెను. క్రీస్తు బ్రెన్‌హాం మనలను విమోచించే సమీప బంధువుడై యున్నాడు.

మరియు ఆయనే మనకొరకు సాయంకాల బలిగా సమర్పించుకొనెను. గనుక ఆయన మనకొరకు చేసిన గొప్ప కార్యములను బట్టి, ఆయనకు వందనములు చెల్లిస్తూ, ప్రభువును స్తుతించెదము.

-ఆమేన్ !

(స్తోత్రం ..... స్తోత్రం ...... స్తోత్రం ..... సోత్రం)

**5.** మనము యేసుక్రీస్తు యొక్క రక్తము ద్వారా రక్షణ పొంది, దేవుని యొక్క సంపూర్ణతను మరియు ఆయన యొక్క అధికారమును పొందుటకై క్రీస్తు బ్రెన్‌హామ్ రెండవ బండగా కొట్టబడెను. మరియు అతి పరిశుద్ధ స్థలములో ప్రవేశించి, అగ్నిస్థంభము క్రిందకు వచ్చి, మరణమును జయించి, అమరత్వమును పొందుటకై, క్రీస్తు బ్రెన్‌హాం రెండవ బండగా కొట్టబడెను. మరియు పెండ్లి కుమార్తె సంఘమైన మనము, శరణు నగరము నుండి పరలోకరాజ్యములో ప్రవేశించుటకు, మన కొరకు ఆయన మహాయాజకునిగా మరణించెను. గనుక దేవుడు మనకొరకు చేసిన గొప్ప కార్యములను బట్టి, ఆయనకు వందనములు చెల్లిస్తూ, హృదయపూర్వకముగా ప్రభువును స్తుతించెదము. -ఆమేన్ !

(స్తోత్రం ..... స్తోత్రం ...... స్తోత్రం ..... సోత్రం)

**6.** క్రీస్తు బ్రెన్‌హాం కూడా, యేసుక్రీస్తువలే చనిపోయి, పాతిపెట్టబడి, మూడవ దినమున తిరిగిలేచి, పరలోకమునకు ఆరోహణమై దేవుని యొక్క సింహాసనము మీద ఆశీనుడాయెను. మరియు ఆయన సింహాసనము యొద్ద నుండి, అధికార పత్రమును నిజమైన పెండ్లి కుమార్తె సంఘమైన మనకు ఇచ్చెను. ఆయొక్క అధికార పత్రము ద్వారా, మనము ఈ లోకమునకు రాజులుగాను, ప్రభువులుగాను, దేవుని చేత తయారుకాబడితిమి. గనుక దేవుడు మనకొరకు చేసిన గొప్ప కార్యములను బట్టి ఆయనకు వందనములు చెల్లిస్తూ ప్రభువును స్తుతించెదము.

-ఆమేన్ !

(స్తోత్రం ..... స్తోత్రం ...... స్తోత్రం ..... సోత్రం)

**7.** దేవుడు తన యొక్క విమోచన చట్టమును ముగించుటకై, మొట్టమొదట నుండి మనలను ఎన్నుకొనెను. ఆ యొక్క విమోచన చట్టమును పూర్తిచేయుటకై దేవుడు మనలను పిలిచెను. మనకు రక్షణనిచ్చి మనలను విమోచించి ఆయన యొక్క ప్రతి ఆజ్ఞలన్నియూ మన యొక్క అధికారములో నుంచెను. మరియు ఆయన యొక్క పునరుత్థానశక్తి చేతమనలను నింపెను. ఏ శక్తియైతే, యేసుక్రీస్తును, క్రీస్తు బ్రెన్‌హాంను, మూడవ దినమున సమాధినుండి లేపెనో, ఆ

యొక్క శక్తిచేత దేవుడు మనలను నింపెను. మరియు మన నోటనుండి వచ్చిన వాక్యము ఆయన యొక్క పునరుత్థాన శక్తి చేత నింపబడి అధికారముతో, ఇక ముందుకునడుచును. గనుక దేవుడు మనకు చేసిన గొప్పకార్యములను బట్టి ఆయనకు వందనములు చెల్లిస్తూ ప్రభువును స్తుతించెదము. –ఆమేన్ !

(స్తోత్రం ..... స్తోత్రం ...... స్తోత్రం ..... సోత్రం)

8. అంత్య దినములలో ఎవరైతే దేవునిని తెలిసికొనెదరో, వారు దేవునిలో స్థిరముగా నిలువబడి, దేవుని కొరకై గొప్ప అద్భుత కార్యములు చేసెదరని ప్రవక్తయైన దానియేలు గారు చెప్పిరి. దేవుని వాక్యమును నెరవేర్చుటకై, ప్రభువు మనలను ఏర్పాటు చేసుకొనెను. గతించిన అనేక సంవత్సరముల నుండి అసలైన నిజమైన తొలకరి వర్షమును, దేవుడు మనపై కుమ్మరించుచున్నాడు. దేవుని యొక్క ఉపదేశము ద్వారా, దేవుడు ఏడు ఉరుముల యొక్క మర్మములు కొంచెము కొంచెముగా బయలుపరచెను. దేవుడు ఏమైయున్నాడు ? దేవుడు ఎవరైయున్నాడు? అని తెలిసికొనుటకై, దేవుడు తన యొక్క క్రొత్త నామమైన, క్రీస్తు బ్రెన్‌హా నామమును బయలుపరచెను. ప్రస్తుతము మనము ఆకాశమును, భూమిని, సముద్రమును, క్రీస్తు బ్రెన్‌హామ్ నామమున కదిలించి, క్రీస్తు బ్రెన్‌హామ్ రాజులకు రాజనియు, ప్రభువులకు ప్రభువనియు, సమస్త ప్రజలకు తెలియజేసి, సర్వలోకమును క్రీస్తు బ్రెన్‌హామ్ నామమున మోకరింపచేసెదము. గనుక ఈ గొప్ప అధికారమును మనకనుగ్రహించిన దేవునికి వందనములు చెల్లిస్తూ, మన హృదయపూర్వకముగా ప్రభువును స్తుతించెదము. –ఆమేన్ !

(స్తోత్రం ..... స్తోత్రం ...... స్తోత్రం ..... సోత్రం)

9. క్రీస్తు బ్రెన్‌హామ్ ముద్రలు విప్పుట ద్వారా, అపవాది యొక్క తలను చితకగొట్టి, మరణము యొక్క పంజరమును నలుగగొట్టి, ప్రతీ శత్రువును, ప్రతీరోగమును, ప్రతీ జబ్బును, ప్రతీ బలహీనతను, సమాధిని, నరకమును, అపవాదిని, మన యొక్క పాదముల క్రిందనుంచెను. మరియు ముద్రలు విప్పుట ద్వారా, క్రీస్తు బ్రెన్‌హాము యొక్క గొప్ప విమోచనా పథకమును సమాప్తి చేసి ఆదాము పోగొట్టిన గొప్ప శక్తిని, అధికారమును మనకనుగ్రహించెను. ముద్రలు విప్పుట ద్వారా సంఘము ఆఖరి విజయమును పొంది, మానవుడు దేవునితో కలిసి, భూమి పరలోకముతో కలిసి, సమయము అనంతకాలముగా మారెను. దీనివలన, పరలోక రాజ్యము ఈ భూలోకములో స్థాపింపబడెను. కాబట్టి మనము పరలోకరాజ్యములో మొట్టమొదటి పౌరులుగా ఉన్నాము. మరియు క్రీస్తు బ్రెన్‌హామ్ రాజులకు రాజనియు, ప్రభువులకు

ప్రభువనియు, సర్వలోకమునకు సాక్ష్యాధారములతో, రుజువు పరచైయున్నాము. మరియు క్రీస్తు బ్రెన్‌హామ్ పాదముల మీద, సర్వలోక ప్రజలను పడవేయనైయున్నాము. గనుక మన దేవునికి వందనములు చెల్లిస్తూ ప్రభువును మన యొక్క సంపూర్ణ హృదయముతో స్తుతించెదము.

**–ఆమేన్ !**

**(స్తోత్రం ..... స్తోత్రం ...... స్తోత్రం ..... సోత్రం)**

**10.** **2000** సంవత్సరముల క్రితము నుండి, ఏడు సంఘకాలములలోనూ అపవాది విశ్వాసుల వెనుకబడి, జబ్బులచేతను, రోగములచేతను, బలహీనతల చేతను, దుఃఖములచేతను పీడించు చుండెను. మరియు అపవాది ప్రవేశింపలేని అతి పరిశుద్ధ స్థలములో దేవుడు మనలను ప్రవేశింపచేసెను. విమోచింపబడిన వారు సంతోషముతో, సీయోనులో ప్రవేశించుచున్నారు. గనుక ప్రతీకష్టమును, ప్రతీ దుఃఖమును, వారి నుండి వెదలిపోయి, ఎల్లప్పుడూ సంతోషా నందములతో జీవించెదరు. ఈ చక్కని వాక్యము నిజమైన పెండ్లి కుమార్తెయైన మనలోనే నెరవేరును. ఈ గొప్ప అధికారము ఏ యుగములో జీవించిన, ఏ మానవునికిగానీ, ఏ ప్రవక్తకుగానీ, ఏ అపోస్తులులకుగానీ, ఏ యొక్క ఏడు సంఘకాలముల దూతలకు గానీ ఇవ్వబడలేదు. గనుక ఈ గొప్ప అధికారమును మనకనుగ్రహించిన దేవునికి వందనములు చెల్లిస్తూ, మన సంపూర్ణ హృదయముతో మన ప్రభువును స్తుతించెదము. **–ఆమేన్..!**

**(స్తోత్రం ..... స్తోత్రం ...... స్తోత్రం ..... సోత్రం)**

–క్రీస్తు బ్రెన్‌హామ్ రెండవస్వారి పరిచర్య

# జీవము గల ప్రభువు క్రీస్తు బ్రెన్‌హామ్ తన వధువుకు ఇచ్చినటువంటి ఎన్నడూ తొలగిపోని వాగ్ధానముల నిబంధన

**1.** ఆ వర్తమానమును నమ్ము నిజాయితీగల హృదయముల కొరకు పరిశుద్ధాత్మ నేడు వెదకి కనుగొనుచున్నాడు. బైబిల్‌లో వాగ్ధానము చేయబడినవన్నియూ మనకు చెందును. మనము దానిని పూర్తిగా అంగీకరించినప్పుడు మనము దానిని చేయగలమని దేవుడు గ్రహించి, దానికి సంబంధించిన హక్కు మూల పత్రమును మనకు ఇచ్చును. పరిశుద్ధాత్మ మనకు దానిని జీవింపచేసి ఇచ్చును. ఓ... మనము ఎటువంటి జనులము... ! దేవుని యొక్క గొప్ప పరిశుద్ధాత్మ ఎంత అద్భుతమగు శక్తిని కలిగియున్నదో చూడండి... ! దానిని గురించి ఆలోచించండి (ఈస్టర్ ముద్ర 25 పేజీ).

**2.** మనం ఎప్పుడూ దానిని గురించి ఆలోచించి కారణం చూడము. దేవుడు ఈ విధంగా పలికెను అను విధముగానే వాక్యమును అంగీకరించుచున్నాము. అప్పుడు అది మనకును, దేవునికి మధ్య ఒక మార్గమును ఏర్పరచును. ప్రతీ మార్గము తెరువబడి మనలను దేవునితో కలిపి వేయును (ఎప్పుడూ పోరాడని అతి గొప్ప పోరాటము)

**3.** ఏడు ఉరుములు ఉరిమియున్నవి. దేవుని వాక్యమును మనము నిజముగానే స్వీకరించి యున్నాము. మనము నిజముగానే వాక్యము తీసుకొని ఉపయోగించెదము. అది ముక్కలు ముక్కలుగా నరుకును. మనము ఆకాశములను మూయగలము. మనము ఏ కార్యమునైనా చేయగలము. మనము కోరిన యెడల కోట్ల టన్నుల బరువు గల ఈగలను కూడా రప్పించగలము. ఆమేన్...! మనము ఏది చెబితే అది అలాగే జరుగును. ఎందుకంటే అది దేవుని నోట నుండి వచ్చు దేవుని వాక్యము.

**4.** యోహానూ భయపడవద్దు, చిన్నమందా భయపడవద్దు. నాలో ఉన్న ప్రతీ దానికి నీవే హక్కును కలిగియున్నావు. నాయొక్క సర్వశక్తియూ మీ కొరకే యున్నది. నేను మీ మధ్యలో ఉన్నప్పుడు నా సర్వశక్తియూ, అధికారమును మీ కొరకే యున్నవి. నేను భయమును, అపజయమును ఇచ్చుటకుకాక ప్రేమనూ, ధైర్యమునూ, సామర్థ్యమును ఇచ్చుటకు వచ్చియున్నాను. సర్వ అధికారము నాకు ఇవ్వబడినది. దానిని ఉపయోగించుట మీ వంతుగా ఉన్నది. నీవు వాక్యమును మాట్లాడుము. నేను దానిని నెరవేర్చెదను. ఇదే నా నిబంధన. ఇది ఎన్నడూ మారదు (7 సంఘ కాలములు 64)

**5.** ఇది చెప్పుము, అది జరుగును. ఇది చేయుము, అది జరుగును. ఇది అదే. నీకంటే ముందున్నది నేనే. దానిని ఋజువు పరచుచున్నది నేనే. నీతో ఉన్నవాడను నేనే (కాలమును మరియు సూచనను ఐక్యము చేయుట)

**6.** ప్రభువు చేయు పద్ధతి చెడుతనమును దూరముగా తన్నివేయుట. ఆలోచించుటను త్రోసివేయుట, మూఢనమ్మకములను, తలంపులను త్రోసివేయుట, పాపమును, అవిశ్వాసమును త్రోసివేయుట. ఆమేన్...! మనము యేసుక్రీస్తుతో చనిపోయి, లేపబడి దేవుని సింహాసనము నందు కూర్చునియున్నాము. వీటన్నింటి కన్నా హెచ్చింపబడి... ఒక్కొక్క సాతానును మన పాదముల క్రింద తన్నియుంచియున్నాము (ఎప్పుడూ పోరాడని అతి గొప్ప పోరాటము 47)

**7.** ఆయన తన యొక్క జీవ వాక్యమును మనకు చూపించెను. మనము దానిని చేర్చుకున్నాము. దానిని గురించి మనమెన్నడూ సందేహించము. అందువలన మనకు ఏదియూ మరణము సహితము హాని చేయజాలదు (నీ కలము తీసుకొని వ్రాయుము).

**8.** దేవుడు ఒక్కొక్క క్రియను విశ్వాసముతోనే చేయుచున్నాడు. దేవుని యొక్క సర్వాయుధ కవచమును కూడా విశ్వాసముతోనే పొందుచున్నాము. దేవుని యొక్క సర్వాయుధ కవచములు చూడండి... ప్రేమ, సంతోషము, సమాధానము, ఆశానిగ్రహము, మంచితనము, శాంతము, దయ, ఓర్పు, సహనము.

**9.** ఒక పురుషుడు లేక ఒక స్త్రీ దేవుని యొక్క సర్వాయుధ కవచమును ధరించి యున్నప్పుడు అది శక్తి కాదు. అది పరలోకము నుండి వచ్చు అధికారముగా ఉన్నది. యేసుక్రీస్తు మనకు ఇచ్చినటువంటి ఈ అధికారము వలన సాతానులు భయపడును. వాహనముల బ్రేకులు క్రీ..చ్ అని నిలబడును, మరణములు వణుకును, ఇంకా సమాధులు కూడా తెరువబడును. ఆమేన్..!

**10.** క్రీస్తు బ్రెన్‌హామ్ నందు ప్రియమైన వారలారా ! ఆయన ప్రశస్తమైన నామమునకు శుభాకాంక్షలు. ఇప్పుడు అన్నియూ ముగించబడినవి. దేవుడు తన పరిపూర్ణతను వధువు యందు ఉంచియున్నాడు. వధువు పరిపూర్ణ విశ్వాసమును పొందియున్నది. ఇప్పుడు ఆమె మాటచేత సృష్టించగల స్థితికి వచ్చియున్నది. సమయము ఇకలేదు. వధువు జీవముగల దేవుని మహాసైన్యముగా సిద్ధమై భూమిని, ఆకాశమును కదిలింపచేసి క్రీస్తు బ్రెన్‌హామ్ ముందు ప్రతీజాతి, ప్రతీ దేశమును మోకరింపజేయుటకు వధువు సిద్ధమైనది.

కావున ప్రియమైన వారలారా ! బైబిల్ నందు, పలుకబడిన వాక్య సందేశముల యందు గల వాగ్దానములన్నింటిని కలిగి దేవుని సర్వాయుధ కవచమును ధరించుకొని సీయోను పర్వత బలపరీక్షకు సిద్ధంకండి...!

## ఊరకుండుడి... నేనే దేవుడనని తెలుసుకొనుడి...
*కీర్తనలు: 46:10*

★ ఒక్కచుక్క కృప కూడా లేని ప్రభువు యొక్క కోపము ఇప్పుడు సంఘములో దిగినది.

★ ఇదే క్రీస్తు బ్రెన్‌హాము కళ్ళల్లో అగ్నిజ్వాలలు రగులు సమయము.

★ ఇదే విందు ఆరగించుచున్న వారిని బలవంతముగా బయటకు తరిమివేయు సమయము.

★ ఇదే గోధుమ గింజలను పొట్టు నుండి వేరు పరచు సమయము.

★ ఇదే బుద్ధిగల కన్యకల వద్ద నుండి బుద్ధిలేని కన్యకలను వేరుపరిచే సయయము.

★ ఇదే కపటస్తుల ముసుగు చింపబడి అందరి కపటము బయటపడే సమయము.

★ ఇదే తీర్పు సంఘములో ఆరంభమయ్యే సమయము.

***"తీర్పు దేవుని ఇంటివద్ద ఆరంభమగు కాలము వచ్చియున్నది".*** (1పేతురు 4:17)

***సమూల ధ్వంసము వచ్చేయున్నది. జనులు సమాధానము కొరకు విచారించుచున్నారు. కానీ, అది వారికి దొరకదు. నాశనము వెంబడి నాశనము కలుగుచున్నది. సమాచారము వెంబడి, సమాచారము వచ్చుచున్నది. వారు ప్రవక్త యొద్ద దర్శనము కొరకు విచారణ చేయుదురు గానీ యాజకులు, ధర్మశాస్త్ర జ్ఞానులు కాకపోయిరి. పెద్దలు ఆలోచన చేయకయే ఉన్నారు.*** (యెహెజ్కేలు 7:25,26)

★ మానవుడు క్షమించినా, దేవుడు క్షమించని సమయము. ఈ లోకంలో దేనినైనా పోగొట్టుకో కానీ దేవుని కృపను పోగొట్టుకొనవద్దు.

★ ఇప్పుడు ఇదే పెండ్లి కుమార్తె దేవుని యొక్క బలమైన సేనగా నిలబడు సమయము. క్రీస్తు బ్రెన్‌హాము పెండ్లి కుమార్తె ! నీవు దేవుని యొక్క ఓడిపోని సైన్యములో పరాక్రమశాలివని గ్రహించి, ప్రభువు నీకిచ్చిన అధికారం నీవు గ్రహించి, ఆ అధికారమును ఉపయోగించి శత్రువైన సాతానును జయించి, జీవము గల ప్రభువైన క్రీస్తు బ్రెన్‌హాము నామమును ఆకాశమునకు హెచ్చించి, ఈ లోకమంతటిని ఆయన పాదముల క్రింద వేయుటకు పరాక్రమముతో నిలబడుము. "ఇదే ఆ సమయము. తమ దేవుని ఎరుగువారు బలము కలిగి గొప్ప కార్యములు చేయుదురు". అని దానియేలు ప్రవక్త చెప్పిన ప్రవచనము నీ మూలముగా నెరవేర్చబడుటకు దేవుడు ఈ లోకము సృష్టింపబడక మునుపే నిన్ను ఏర్పరచుకొని, ఈ అంత్యదినమున నిన్ను పిలచి యేసుక్రీస్తు రక్తము ద్వారా నిన్ను రక్షించి, క్రీస్తు బ్రెన్‌హాము రక్తము ద్వారా నిన్ను విమోచనలోనికి నడిపించి, దేవుడు తన సకల సంపూర్ణతతో నిన్ను నింపి, ఈ లోకమునకు సంబంధించిన హక్కు మూల పత్రమును నీకు ఇచ్చి, పరిశుద్ధ గ్రంథములో, పలుకబడిన వాక్యములో ఉన్న ప్రతీ వాగ్దానమును

నీకు ఇచ్చి, నీ వాక్యము జీవింపబడి వెళ్ళుటకు దేవుడు తన జీవింపజేయు సామర్థ్యము చేత అంటే ప్రభువైన యేసుక్రీస్తును, క్రీస్తు బ్రెన్‌హామును మరణము నుండి జీవింపజేసిన తన యొక్క జీవింపచేయు సామర్థ్యముచేత నింపి, నీ వాక్యము జీవింపబడి వెళ్ళును అని వ్రాయబడి యున్నది కదా...! ఆమేన్ !

1. నీవు దత్తపుత్రత్వము పొందుట వలన నీయొక్క అధికారము ప్రధాన దూత అధికారము కంటే గొప్పగా ఉన్నది అని మనలను గూర్చి వ్రాయబడియున్నదే.

2. ఈ అంత్యదినములలో వాక్యము జీవింపబడి వెళ్ళుచున్నది అని వ్రాయబడియున్నదే.

3. దేవుడు నిన్ను శత్రువైన సాతానుకంటే పరాక్రమశాలిగా చేసియున్నాడు అని మనలను గూర్చి వ్రాయబడియున్నదే.

4. దేవుడు నీ సకల శత్రువైన ప్రతీ వ్యాధిని, అనారోగ్యమును, బలహీనతను, మరణమును, సాతానును, పాతాళమును నీ పాదముల క్రింద వేసియున్నాడు అని మనలను గూర్చి వ్రాయబడియున్నదే.

5. నీయొక్క జీవింపబడి వాక్యము యొక్క అధికారమును చూచి, సాతాను గుంపు భయముతో కేకలు వేయుచున్నది. మరణము వణుకుచున్నది అని మనలను గూర్చి వ్రాయబడి యున్నదే.

6. నీయొక్క జీవింపబడిన వాక్యము ఆకాశములో మెరుపువలే మెరియుచున్నది అని మనలను గూర్చి వ్రాయబడియున్నదే.

7. నీయొక్క జీవింపబడిన వాక్యము ఆకాశమును, భూమిని కదిలింపజేయును అని మనలను గూర్చి వ్రాయబడియున్నదే.

8. నీయొక్క జీవింపబడిన వాక్యము సాతానును కట్టివేయుచున్నది అని మనలను గూర్చి వ్రాయబడియున్నదే.

9. దేవుని యొక్క వాక్యము మన శత్రువైన సాతానుపై వేయవలసిన అణుబాంబుగా వున్నది అని మనలను గూర్చి వ్రాయబడియున్నదే.

10. నీవు ఒక వాక్యమును చెప్పు. నేను దానిని నెరవేర్చెదను. ఇది నేను నీతో చేసిన నిబంధన ఇది ఎన్నటికీ తప్పిపోదు అని మనలను గూర్చి వ్రాయబడియున్నదే.

11. ఆ ఏడు ఉరుములు ఆ చిన్నమందకు ధ్వనించు వరకు కాచుకుని యుండండి. అప్పుడు వారు వాక్యమును నిజముగా ఉపయోగించెదరు. వారియొక్క జీవింపబడిన వాక్యము శత్రువును నరుకునట్లుగాను, పొడిచినట్లుగాను ఉండును అనియూ వారు ఆకాశమును

మూసివేయుదురు అనియూ, వారు కావాలంటే కోట్లకొలది టన్నుల బరువుగల ఈగలను కూడా రప్పింపజేయగలరనియూ, వారు ఏమి కావాలన్నా చేయుదురనియూ, వారు ఏమి చెప్పెదరో అది అదేవిధముగా జరుగుననియూ, ఎందుకంటే అది దేవుని యొక్క వాక్యము. దేవుని నోట నుండి బయలుదేరి వచ్చుచున్నది అని మనలను గూర్చి వ్రాయబడి యున్నదే.

12. నీవు క్రీస్తు బ్రెన్‌హామును విశ్వసించి, నీ ఆత్మలో అది ఎల్లప్పుడూ అల్లాడుచుండిన యెడల ఏదో ఒకటి జరుగుననియూ, పాపము, రోగము నిన్ను వదిలి వెళ్ళుననియూ, ఎండకాలము నందు ఎండ ప్రకాశించినప్పుడు భూమిమీద చెల్లాచెదురుగా పరుగెత్తే బొద్దింకల వలే సాతాను గుంపుకూడా చెల్లాచెదురుగా పరుగెత్తును అని మనలను గూర్చి వ్రాయబడియున్నదే.

13. వ్రాయబడియున్నదే వ్రాయబడియున్నదే వ్రాయబడియున్నదే వ్రాయబడియున్నదే అని పలుకుచూ వాక్యము నందు స్థిరముగా నిలబడండి. అప్పుడు వాక్యము జీవింపబడి మనకు బాధలను కలిగిస్తున్న శత్రువైన సాతానును తరుమును అని మనలను గూర్చి వ్రాయబడియున్నదే.

14. అరణ్యమునందు యేసుక్రీస్తు యెదుట సాతాను ఓడిపోయి వున్న విధముగా ఈ అంత్య దినమున పెండ్లి కుమార్తె యెదుట సాతాను ఓడింపబడి ఉండును అని మనలను గూర్చి వ్రాయబడియున్నదే.

ఇదే నీవు ఆకాశమును, భూమిని కదిలింపజేయు సమయమని గ్రహించి, మేల్కొని నీ కొరతలను చూడకుండా దేవుని సర్వాంగ కవచమును ధరించుకొని, ధైర్యముగా వాగ్ధానములను గైకొని స్థిరముగా నిలబడి జీవము గల ప్రభువైన క్రీస్తు బ్రెన్‌హాము నామమున నీ యొక్క జీవింపబడిన వాక్యము ద్వారా చరిత్ర యందు ఎన్నడూ జరుగని గొప్ప కార్యములు చేసి ఆకాశమును, భూమిని కదిలింపజేసి ఈ లోకం అంతటినీ రాజులకు రాజును, ప్రభువులకు ప్రభువైన క్రీస్తు బ్రెన్‌హాము పాదముల క్రింద వేయుటకు పరాక్రమముతో నిలబడమని పెండ్లి కుమార్తెయైన మనకు మారు రూపంతో ఇండియావచ్చిన మన ప్రభువైన క్రీస్తు బ్రెన్‌హాము ఆజ్ఞాపించియున్నారు. ఆమేన్...!

# ఉన్నత గ్రహింపు శక్తి

*ప్రభువు సెలవిచ్చునది ఏమనగా...! ఇంకా కొంత కాలానికి మరియొకసారి ఆకాశమును, భూమిని, సముద్రమును, నేలను కంపింపజేతును. (హగ్గయి 2:6)*

ఆకాశమును, భూమిని, సముద్రమును, నేలను దేవుడు ఎలా కదిలించబోవుచున్నాడు?

మనయొక్క ఉన్నత గ్రహింపు శక్తి మాత్రమే ఈ కార్యములను చేయబోవుచున్నది.

ఉన్నత గ్రహింపు శక్తి అంటే ఏమిటి ?

ఉన్నత గ్రహింపు శక్తి ఇప్పుడు ఎక్కడ ఉన్నది ?

1. మనలో నివశించు దేవుని యొక్క విశ్వాసమే ఉన్నత గ్రహింపు శక్తి.
2. ప్రభువైన దేవుని యొక్క సామర్థ్యమే ఉన్నత గ్రహింపు శక్తి.
3. ఉన్నత గ్రహింపు శక్తి అనేది మనల్ని కదిలించి ఆ కార్యములను చేయునట్లు చేసే సామర్థ్యము.
4. ఉన్నత గ్రహింపు శక్తి ప్రపంచంలో ఎన్నడూ బయలుపరచబడని గొప్ప సామర్థ్యము. ఉన్నత గ్రహింపు శక్తి దేవుని వాక్యముచే జీవించును.
5. ఉన్నత గ్రహింపు శక్తి మనలను నేరుగా దేవుని సన్నిధికి తీసుకుపోతుంది.
6. ఉన్నత గ్రహింపు శక్తి దేవుని యొక్క వాక్యమునకు వ్యతిరేకముగా ఉన్న ఏ కలవరాన్నైనా దానిని త్రోసివేయును.
7. ఉన్నత గ్రహింపు శక్తి మిగిలిన 5 జ్ఞానేంద్రియాలను కంట్రోల్ చేస్తుంది.
8. మనము ఏది అడిగినా దానిని దేవుడు ఇస్తాడని ఉన్నత గ్రహింపు శక్తికి తెలుసు.
9. ఉన్నత గ్రహింపు శక్తి మిగతా జ్ఞానేంద్రియాల ఆలోచనలను త్రోసివేస్తుంది.
10. ఉన్నత గ్రహింపు శక్తి జరగలేని కార్యములను జరిగేటట్లు చేస్తుంది.
11. ఉన్నత గ్రహింపు శక్తి దేవుని యొక్క సామర్థ్యమును దృశ్యం మీదకు తీసుకుని వచ్చును.
12. ఉన్నత గ్రహింపు శక్తి కష్టసమయములో గొప్ప ఎదురింపు ఇచ్చును.
13. పరిశుద్ధాత్మ, ఉన్నత గ్రహింపు శక్తి పరస్పరము దగ్గరకు వచ్చినప్పుడు ఎంతో గొప్ప కార్యములు జరుగును.
14. ఉన్నత గ్రహింపు శక్తి కాంతి వేగంతో దేవుని వద్ద నుండి మనకు జవాబు తెచ్చును.

15. ఒక వ్యక్తి కొరకు మనము ప్రార్థించినప్పుడు మనయొక్క ఉన్నత గ్రహింపు శక్తి వెళ్ళి, ఆ వ్యక్తిని ఆవరించి, కాపాడి, అపాయము నుండి విడిపించును.

ఉన్నత గ్రహింపు శక్తి విశ్వాసి యొక్క స్వాస్థ్యము. ప్రభువైన యేసుక్రీస్తులోని ఉన్నత గ్రహింపు శక్తి ఈ చివరి దినములలో క్రీస్తు బ్రెన్‌హాములోనికి వచ్చి ఇప్పుడు నిజమైన వధువుగా వున్న మనలోనికి వచ్చియున్నది.

ఉన్నత గ్రహింపు శక్తే యేసుక్రీస్తును, క్రీస్తు బ్రెన్‌హామును మరణము నుండి పునరుత్థానము పొందునట్లు చేసినది. అదే ఉన్నత గ్రహింపు శక్తి చనిపోయిన పరిశుద్ధులను పునరుత్థానము పొందునట్లు చేయబోవుచున్నది. అదే ఉన్నత గ్రహింపు శక్తి వధువుగా వున్న మనలను ఎత్తబాటులో తీసుకొని పోబోవుచున్నది. ఆమేన్ !

ఓ పెండ్లి కుమార్తె ! ఉన్నత గ్రహింపు శక్తే దేవుడు మనకిచ్చియున్న స్వాస్థ్యము. ఉన్నత గ్రహింపు శక్తి మన జీవితం కంటే ఎంతో ప్రశస్తమైనది. కావున మనల్ని మనమే సజీవ అర్పణముగా దేవునికి సమర్పించుకొని ఉన్నత గ్రహింపు శక్తి పొందుదాము. ఆమేన్ !

దేవుని వాక్యప్రకారము సరిచేసుకొనుటకు ఎవరికి మనసులేదో... అటువంటి వారిని దేవుడు ఖచ్చితంగా దృశ్యం మీద నుండి తొలగించి వేస్తాడు. ఇది సత్యము. ఆమేన్ ! ఆమేన్ ! ఆమేన్ !!!

–క్రీస్తు బ్రెన్‌హాము రెండవ పరిచర్య

# క్రీస్తు బ్రెన్‌హామ్ ముద్రలు విప్పుట యొక్క భావము

1. క్రీస్తు బ్రెన్‌హామ్ ముద్రలు విప్పుట వలన దేవుని యొక్క పరాక్రమ కార్యము సాధించెను. ఆమేన్ ! ఆమేన్ !! ఆమేన్ !!!

2. క్రీస్తు బ్రెన్‌హామ్ ముద్రలు విప్పుట వలన దేవుని యొక్క గొప్ప విమోచనా పథకమును సమాప్తి చేసెను. ఆమేన్ ! ఆమేన్ !! ఆమేన్ !!!

3. క్రీస్తు బ్రెన్‌హామ్ ముద్రలు విప్పుట వలన మానవుని ద్వారా సాతానుకు మరణకరమైన దెబ్బ తగిలినది. ఆమేన్ ! ఆమేన్ !! ఆమేన్ !!!

4. క్రీస్తు బ్రెన్‌హామ్ ముద్రలు విప్పుట వలన సంఘము సంపూర్ణ ఆఖరి విజయం పొందెను. ఆమేన్ ! ఆమేన్ !! ఆమేన్ !!!

5. క్రీస్తు బ్రెన్‌హామ్ ముద్రలు విప్పుట వలన యేసుక్రీస్తు ఏవిధముగానైతే తన మరణము వలన సాతాను యొక్క తలను చితుక గొట్టెనో, అదేవిధముగా క్రీస్తు బ్రెన్‌హామ్ కూడా ముద్రలు విప్పుట వలన సర్పము యొక్క తలను చితుక గొట్టెను. ఆమేన్ ! ఆమేన్ !! ఆమేన్ !!!

6. క్రీస్తు బ్రెన్‌హామ్ ముద్రలు విప్పుట వలన విజయవంతముగా మరణమును మ్రింగివేసెను. ఆమేన్ ! ఆమేన్ !! ఆమేన్ !!!

7. క్రీస్తు బ్రెన్‌హామ్ ముద్రలు విప్పుట వలన మరణము యొక్క పంజరము నలుగగొట్టి, ప్రతీ బంధకము నుండి విడిపించి, తనయొక్క పిల్లలమైన మన కాళ్ళక్రింద ప్రతీ శత్రువును ప్రతీ జబ్బును, ప్రతీ అనారోగ్యమును, ప్రతీ బలహీనతను, మరణమును, సమాధిని, నరకమును, పెండ్లి కుమార్తెయైన మన కాళ్ళక్రింద ఉంచెను. ఆమేన్ ! ఆమేన్ !! ఆమేన్ !!!

8. క్రీస్తు బ్రెన్‌హామ్ ముద్రలు విప్పుట వలన ఆయన తిరిగి దస్తావేజును మరియు పుత్ర స్వీకార శక్తిని పొందుట వలన క్రీస్తు బ్రెన్‌హామ్ ఈ లోకమునకు దేవుడుగాను, రాజుగాను ఆయెను. మరియు ఆయన చనిపోయి పైకెత్తబడిన తరువాత ఇప్పుడు ఆయన అసలైన పెండ్లి కుమార్తె సంఘమైన మనకు ఆ దస్తావేజును ఇచ్చెను. ఆ దస్తావేజు పెండ్లికుమార్తె సంఘమైన మనము పొందుట ద్వారా మనము ఈ లోకమునకు దేవుళ్ళుగానూ, రాజులుగానూ అయ్యాము. ఆమేన్ ! ఆమేన్ !! ఆమేన్ !!!

9. అతి త్వరలో పరలోకము నుండి పొందిన ఈ అధికారము ద్వారా పెండ్లి కుమార్తె సంఘమైన మనము శక్తి గల జయింప శక్యముగానీ జీవముగల దేవుని మహాసైన్యముగా బయలుదేరి ఆకాశమును, భూమిని కదిలించి క్రీస్తు బ్రెన్‌హామ్ ప్రభువని ఒప్పుకొను నట్లుగా ప్రతీ దేశమును చేయుదుము. ఆమేన్ ! ఆమేన్ !! ఆమేన్ !!!

–క్రీస్తు బ్రెన్‌హామ్ రెండవస్వారి పరిచర్య

# ప్రార్థన

1. ప్రభువా ! ఈ చిన్నమందలో ఏ ఒక్కరూ ఎత్తబడుటలో తప్పిపోకుండా కాపాడుము. ఆమేన్ ! ఆమేన్ !! ఆమేన్ !!!

2. ప్రభువా ! ఇన్ని దినముల నుండి ఈ సత్యము వెనుక మేము పరిగెత్తిన పరుగు వ్యర్థము కాకుండా కాపాడుము. ఆమేన్ ! ఆమేన్ !! ఆమేన్ !!!

3. ప్రభువా ! ప్రతీ ఒక్కరూ భయభక్తులతో నింపబడి, ఓడలో ప్రవేశించి, రక్షింపబడునట్లు చేయుము. ఆమేన్ ! ఆమేన్ !! ఆమేన్ !!!

4. దేవుడు ఏడవ దూతకు ఇచ్చిన మిగిలిన చిన్న గుంపులో ఉన్నవారిని గురించి శ్రేష్ఠమైన భావముతో ప్రార్థన చేయుదుము. ఆమేన్ ! ఆమేన్ !! ఆమేన్ !!!

5. ప్రభువా ! నీవు చెప్పితివి “దేవుడు ఏడవ దూతకు ఇచ్చిన మిగిలిన చిన్నగుంపు దేవుని పిలిచినట్లయిన ఏమి జరుగునో ధ్యానించుమని” ప్రభువా ! ఇప్పుడు అదేవిధముగా ప్రార్థించుచున్నాము. దయచేసి, నీవు నీ పనితో రంగంమీదకు రమ్ము. ఆమేన్ ! ఆమేన్!! ఆమేన్ !!!

6. ప్రభువా ! మేమేమియూ లేమని నమ్రతతో మీ యొదుట ఒప్పుకొనుచున్నాము. ఆమేన్! ఆమేన్ !! ఆమేన్ !!!

7. పరిశుద్ధాత్మడే మన న్యాయాధిపతి. ఆమేన్ ! ఆమేన్ !! ఆమేన్ !!!

8. ఆయన కోపం నిమిషం మాత్రము ఉండును. ఆయన దయ ఆయుష్కాలమంతయు నిలుచును. ఆమేన్ ! ఆమేన్ !! ఆమేన్ !!!

9. ప్రభువా ! నీవు ఈ దినము మాకు బంగారు సమయముగా ఇచ్చియున్నావు. ఈ విషయము మా హృదయములలో తలంచునట్లు నీ కృప దయచేయుము. మరియు నీయొక్క పరిశుద్ధాత్మను అతి జాగ్రత్తగా మా హృదయములో ఉంచుకొనునట్లు చేయుము. ఆమేన్ ! ఆమేన్ !! ఆమేన్ !!!

10. ప్రభువా ! ఎత్తబడుటలో మేము తప్పిపోకుండా నీ కృప దయచేయుము. ఆమేన్ ! ఆమేన్ !! ఆమేన్ !!!

11. ప్రభువా ! ప్రతీ ఒక్క విశ్వాసిలోనున్న చల్లదనమును తీసివేయుము. ఆమేన్ ! ఆమేన్ !! ఆమేన్ !!!

12. ప్రభువా ! పెండ్లి కుమార్తెలోనున్న ప్రతీ ఒక్కరికి ఎల్లకాలముండే నీయొక్క తప్పిపోని సన్నిధి దయచేయుము. ఆమేన్ ! ఆమేన్ !! ఆమేన్ !!!

13. సంఘములతో ఆత్మ చెప్పుచున్నమాట చెవిగలవాడు వినునుగాక ! ఆమేన్ ! ఆమేన్ !! ఆమేన్ !!!

–క్రీస్తు బ్రెన్‌హామ్ రెండవస్వారి పరిచర్య

ముగింపు ప్రార్థన:

మన ప్రభువులకు ప్రభువును– రాజులకు రాజును, మన పెండ్లి కుమారుడైన క్రీస్తు బ్రెన్‌హాం కృప ఇప్పుడును ఎల్లప్పుడును అతి.. అతి త్వరలో ఆయనను ముఖాముఖిగా దర్శించువరకూ ప్రతి ఒక్కరికీ తోడైయుండి మనలను నడిపించునుగాక!!! ఆమేన్!

మన నమ్మకమునకు, విశ్వాసమునకు పాత్రుడైన క్రీస్తు బ్రెన్‌హాము జీవముగల దేవుడు. ఆయన నామము మహిమగల నామము. ఆయన వాక్యము సత్యము! ఆయన యొక్క చిత్తము నిశ్చయముగా నెరవేర్చబడును. ఆకాశము, భూమి కదిలింపబడును కాని క్రీస్తు బ్రెన్‌హము వాక్యము గతించదు.

ఈ రోజులలో ఆయన తన బిడ్డలకు నిజమైన దేవునిగా ఉన్నాడు. తమ పిల్లలకు చీకటిని వెలుగుగాను, చెడును మంచిగాను, కన్నీటిని సంతోషముగాను మార్చుచున్నాడు.

ఆయన ఒక్కరికే.. క్రీస్తు బ్రెన్‌హాము ఒక్కరికే సకల స్తుతి, ఘనత, మహిమ, స్తోత్రము, ఆరాధన, ప్రభుత్వము, రాజరికము ఇప్పుడు ఎల్లప్పుడును సదాకాలముయుండునుగాక! ఆమేన్!

మన నమ్మకమునకు, విశ్వాసమునకు పాత్రుడైన క్రీస్తు బ్రెన్‌హాము... ఆయనే రాజులకు రాజు, ప్రభువులకు ప్రభువుగా అభిషేకించబడినందువలన ప్రతి ఒక్కరి హృదయము భయముతో పీడింపబడి, ప్రతి ఒక్కరూ భయముతో మోకరిల్లి, ప్రతి ఒక్కరి నాలుక క్రీస్తు బ్రెన్‌హామే ప్రభువని అంగీకరించునుగాక! ఆమేన్! ఆమేన్!

గ్లోరీ టు గాడ్!